రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటాం


పెనుకొండలో నిర్వహించిన ర్యాలీలో ఓ భాగం


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, సమన్వయకర్తలు ఈరలక్కప్ప, దీపిక


యూరియా కొరతపై వినూత్నంగా నిరసన తెలియజేస్తున్న నాయకులు

- కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్నీ కష్టాలే
- ఎరువులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- పెనుకొండలో 'అన్నదాత పోరు' విజయవంతం

పెనుకొండ రూరల్: 'సమస్యలపై రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాడుతూనే ఉంటాము. రైతులకు ఎరువులు కూడా అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పెనుకొండలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైంది. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్, యూరియా సక్రమంగా ఇవ్వాలి, బ్లాక్ మార్కెట్ నియంత్రించాలి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలంటూ రైతులు, నాయకులు నినదించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ప్రచార రథంలో సభను ఉద్దేశించి నాయకులు మాట్లాడారు.

కూటమి నాయకులకు దోచుకోవడమే పని

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ రైతులు పంటలు పెడితే కనీసం ఎరువులు అందించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకే నేడు రైతులకు మద్దతుగా నిరసన చేపట్టామన్నారు. యూరియా సరఫరాపై ప్రభుత్వ పెద్దలకు స్పష్టత లేదన్నారు. యూరియా అందుబాటులో ఉందంటారు... ఆ మరుసటి రోజే ఇండెంట్ పంపామంటారు.. ఏది నమ్మాలో రైతులకు అర్థం కావడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఏ కష్టం తెలియకుండా రైతు భరోసా కేంద్రాల వద్దే అన్ని సేవలు అందించినట్లు గుర్తు చేశారు. నేడు గ్రామస్థాయిలో ఆ సేవలు కనిపించడం లేదన్నారు. సమస్యలపై రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. పీపీపీ విధానాన్ని ప్రవేశపెట్టింది రాష్ట్ర అభివృద్ధికి కాదన్నారు. పీ అంటే వ్యవస్థలను ప్రైవేటు పరం చేయడం.. పీ అంటే వచ్చిన లాభాలను పంచుకోవడం, పీ అంటే ప్రతిపక్షంపై కేసులు పెట్టడం మాత్రమేనన్నారు. కూటమి నాయకులు దోచుకునేందుకు మాత్రమే ఇది ఉపయోగడుతుందన్నారు.

మంత్రి సవితకు విజయవాడ-హైదరాబాద్‌కు తేడా తెలీదు

విజయవాడ–హైదరాబాద్‌కు తేడా తెలియని వ్యక్తి మంత్రి సవిత అని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. అడ్డగోలుగా అక్రమ సంపాదనకు తెరలేపింది నిజం కాదా అని మంత్రి సవితను ప్రశ్నించారు. ప్రతి దాంట్లో కమీషన్లు దండుకుంటున్నారని నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని, ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, సమన్వయకర్తలు దీపిక, ఈరలక్కప్ప ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, హిందూపురం పరిశీలకులు ఫయాజ్ బాషా, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రవిశేఖర్ రెడ్డి, వాగేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కుంచిటిక వక్కలిగా విభాగం అధ్యక్షులు రంగేగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మడకశిర తాలుకా లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు ఈరలక్కప్ప, దీపిక

'అన్నదాత పోరు'కు తరలిన నాయకులు

రొళ్ల: మండలం నుంచి జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డితో పాటు వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెనుకొండలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి తరలి వెళ్లారు. అనంతరం అనంతరాజు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ కలిసి రాజకీయ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, యువనాయకులు ప్రసన్నకుమార్, భోజేగౌడు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, వైఎస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: రైతాంగ సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట అన్నదాత పోరు పెద్ద ఎత్తున జరిగింది. ఈ నిరసన కార్యక్రమానికి మడకశిర నియోజకవర్గం నుండి సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకత్వంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్ళారు. మాజీ మంత్రి నర్సేగౌడ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, వాగేష్, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్, మండల కన్వీనర్లు రామిరెడ్డి, యంజారేగౌడ్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, త్రిలోక్‌నాథ్, ఎంపీపీలు ఈరన్న, విజయరంగేగౌడ్, సత్యనారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ సభ్యులు అశ్వత్థనారాయణ, మంజునాథ్, శ్రీనివాస్,బీసీ సెల్ రాష్ట్ర విభాగం సభ్యులు సత్యనారాయణ యాదవ్, తిమ్మప్ప, మల్లికార్జున, శేషాద్రి, శివానంద తదితరులు అన్నదాత పోరులో పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపక్షి నుంచి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి పెనుకొండకు బయలుదేరారు.


రొళ్ల : అన్నదాత పోరుకు వెళ్తున్న అనంతరాజు, నరసింహారెడ్డి తదితరులు


అన్నదాత పోరులో పాల్గొన్న మడకశిర వైఎస్సార్‌సీపీ నేతలు


లేపాక్షి నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రైతులకు అన్నీ కష్టాలే..

మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం చంద్రబాబు రైతుల పట్ల చిన్న చూపు చూస్తూ కష్టాలకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. యూరియా, పంటలకు గిట్టుబాటు ధర, రైతు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై పెనుకొండలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, తాలుకా లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మడకశిర నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత, ప్రధాన సమస్యలపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్నదాత పోరు కార్యక్రమం చేపట్టామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేల్లో ఎరువులు సమృద్ధిగా నిల్వ ఉండేవన్నారు. విత్తనాలు కొరత కూడా ఉండేది కాదన్నారు. అదే విధంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిందని, ఎంతో సంతోషంగా పంటలను పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందేవారన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో అలాంటి ప్రోత్సాహం కనిపించలేదన్నారు. ఆర్డీఓ కార్యాలయం అన్నదాత పోరుకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ కన్వీనర్లు, మండల ,తాలుకా,గ్రామ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలివెళ్లారు.


మడకశిర నుంచి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

చిలమత్తూరు: దేశానికి వెన్నుముక అయిన రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం నట్టేట ముంచుతోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. మంగళవారం పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన 'అన్నదాత పోరు' లో పాల్గొనేందుకు సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున హిందూపురం నుంచి తరలివెళ్లారు. అంతకు ముందు హిందూపురంలోని పార్టీ కార్యాలయం వద్ద దీపిక మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కేవలం తమ పార్టీల నేతలు, కార్యకర్తల జేబులు నింపేందుకు అన్ని వర్గాల వారికి తీరని ద్రోహం చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత వేణురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రాము, రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎ శివ, ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, జెడ్పీటీసీ నాగభూషణం, అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ బందేపల్లి శంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, ఆదినారాయణ, మంజునాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు షాజియా,మల్లికార్జున, రామచంద్ర, మారుతిరెడ్డి, మహిళా విభాగం నేత కవిత, అన్సర్ అహ్మద్, రామాంజినేయులు, మింటు, మల్లేష్, నరస, రామచంద్రారెడ్డి, రంగారెడ్డి , నాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


హిందూపురం పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సమన్వయకర్త దీపిక

సీఎం సభకు స్కూల్, ఆర్టీసీ బస్సులు

- ప్రభుత్వ తీరుపై ప్రయాణికులు, తల్లిదండ్రుల ఆగ్రహం



మడకశిర/హిందూపురం టౌన్: అనంతపురంలో బుధవారం సూపర్ సిక్స్–సూపర్ హిట్ పేరుతో కూటమి ప్రభుత్వం సభ నిర్వహించనుంది. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు తదితరులు హాజరు కానున్నారు. ఈ సభకు భారీ ఎత్తున జనసమీకరణ చేయడానికి కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను కూటమి నాయకులు జిల్లా వ్యాప్తంగా తీసుకున్నారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే ఆర్టీసీ అధికారులు పలు ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం కూడా ఆర్టీసీ బస్సులు ఉండవు. రెండు రోజుల పాటు ఆర్టీసీ బస్సులు తిరగవు. దాదాపు ఆయా డిపో పరిధిలో వివిధ రూట్లకు వెళ్లే 80 శాతం బస్సులు రద్దయ్యాయి. మడకశిర డిపోలో 30 బస్సులు ఉన్నాయి. ఇందులో దాదాపు 25 బస్సులను రూట్లకు వెళ్లకుండా రద్దు చేశారు. మరోవైపు హిందూపురంలోనూ అదే పరిస్థితి ఉంది. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలపై పూర్తి స్థాయిలో ఒత్తిడి తేవడంతో ఆయా స్కూళ్ల బస్సులన్నీ సీఎం సభకు ఏర్పాటు చేశారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభకు ప్రైవేటు పాఠశాలల బస్సులు పంపాలని, లేకపోతే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు ఆయా విద్యాసంస్థల యాజమాన్యలకు హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. సీఎం సభ కోసమని పాఠశాలలకు సెలవు ఇచ్చి బస్సులను వాడుకో వడమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

అన్నదాత పోరు విజయవంతం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. పార్టీ శ్రేణులు, రైతులు నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దిగి వచ్చి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు ఎదురు తిరగడం ఖాయమని హెచ్చరించారు. యూరియా సమస్యను వెంటనే పరిష్కరించి రైతులను ఆదుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా కోసం రైతుల తిప్పలు


యూరియా కోసం వేచివున్న రైతులు

పరిగి: మండలంలోని ఊటుకూరులో మంగళవారం జరిగిన యూరియా పంపిణీకి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమైంతా రైతులతో కిటకిటలాడింది. ఊటుకూరులో జరిగిన పంపిణీలో మంగళవారం 280 బస్తాలు (బస్తాలో 45 కేజీలు) రైతులకు అందించినట్లు వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. మండలానికి మొత్తం 231 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దారు హసీనా సుల్తానా పర్యవేక్షించారు.

రేపు మండల మీట్

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

సోమందేపల్లి: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఫైరోజ్ బేగం తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులు ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. హైరిస్క్ గర్భిణుల వైద్యంపై జాగ్రత్తగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగేంద్ర నాయక్, సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యులు ఓంకార్, తస్నిప్, సూపర్ వైజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరుడి హుండీ కానుకల లెక్కింపు


అలంకరణలో శనీశ్వరస్వామి

పావగడ: స్థానిక శనీశ్వర స్వర్ణ దేవాలయానికి హుండీ కానుకల ద్వారా రూ.69.12 లక్షలు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇటీవల శ్రావణ మాసం లో వచ్చిన 5 శ్రావణ శనివారాల్లో భక్తులు శనీశ్వరస్వామికి హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. దేవాలయానికి అనుబంధమైన అన్నపూర్ణేశ్వరి అన్నదాసోహ ట్రస్ట్ హుండీ నుంచి రూ 2.30 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అదే విధంగా ఇతర పూజల నుంచి సుమారు రూ.80 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

పెనుకొండ: కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ నాయకులు పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని నిరసన తెలియజేశారు. నాయకులు మల్లికార్జున, కరణ్, మహేష్, బావక్క తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిందూపురం టౌన్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ల్ వినోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు ఈఎస్ఐ, పీఎఫ్ అడ్డదారిన సొంత ఖాతాలోకి మళ్లించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొల్లపల్లి వాటర్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే ఇవ్వాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి మారుతీరెడ్డి, ఉపాధ్యక్షులు సమీవుల్లా, జిలాన్, సహాయ కార్యదర్శి నౌషాద్, అన్సర్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో అక్రమంగా మట్టి తవ్వకాలు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ టీడీపీ నేత పెన్నానదిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇష్టారీతిన అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. తాజాగా మంగళవారం పెన్నా నదితో జేసీబీ ద్వారా మట్టిని తవ్వి ప్రైవేటు లేఔట్‌లకు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా సమాధానం చెప్పలేక అక్కడి నుంచి వాహనాలతో సహా జారుకున్నాడు. అధికారులకు సమాచారం ఉన్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

పెన్నానదిలో జేసీబీ ద్వారా మట్టిని తవ్వుతున్న దృశ్యం



సంక్షిప్త సమాచారం

ఈ– క్రాప్ బుకింగ్ పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి వద్ద వేరుశనగ పంట పొలంలో నమోదు చేస్తున్న ఈ– క్రాప్ బుకింగ్ నమోదును తహసీల్దార్ హసీనా సుల్తాన్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ– క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని సూచించారు.

తొలి దశలోనే క్యాన్సర్‌ను అరికట్టాలి

హిందూపురం టౌన్: తొలి దశలోనే క్యాన్సర్‌ను కనుక్కొని అరికట్టడానికి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సెమినార్ హాలులో జరుగుతున్న ఎన్‌సీడీ 4.0 శిక్షణ కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిశీలించారు. క్యాన్సర్ గుర్తింపు కోసం ఇంటింటి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ నాగేంద్ర నాయక్, మెడికల్ ఆఫీసర్ నరేష్ కుమార్, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, సీహెచ్ఓ వనప్ప, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

హిందూపురం టౌన్: పట్టణంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి సయ్యద్, నాగశ్రీ ఐటీఐ మొదటి సంవత్సరం ఉత్తీర్ణత సాధించడంతో వారి ప్రతిభను గుర్తిస్తూ మంగళవారం ఎంఈఓ గంగప్ప ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్మన్ రమేష్, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఆనందబాబు, బైసాని రాంప్రసాద్‌లు పాల్గొని వారిని అభినందించి, మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 ప్రసన్నలక్ష్మీ, ఫిజియోథెరపిస్ట్ రూపేష్ నాయక్, భవిత టీచర్లు లలిత, నందిని, సూర్యనారాయణ, రామిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధన చేయాలి

పావగడ: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించి వారి బంగారు భవితను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అన్నారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో మంగళవారం నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఈఓ రేణుకమ్మ, మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, మున్సిపల్ చైర్మన్ సుదేశ్ బాబు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరించాలి

అగళి: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని మహిళలు, ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యులు, విద్యార్థులు తల్లిదండ్రులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం అగళి , హళ్లికేర్ పంచాయతీ కేంద్రంలో ర్యాలీ చేపట్టారు.

ఫిజియోథెరఫీ దినోత్సవం

హిందూపురం టౌన్: పట్టణంలో ఫిజియోథెరఫీ వైద్యుడు అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఫిజియోథెరఫీ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన ప్రముఖ స్పైన్ సర్జన్ వైద్యుడు గోపాల్ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్‌కుమార్, సతీష్, వెంకటేష్, ఇమ్రాన్, ఇర్ఫాన్, ఉన్ని క్రిష్ణ, శ్రీలక్ష్మీ, పరిమళ, శిరీష, సుమయలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథ్, ఉపాధ్యాయుడు వెంకటేష్‌ప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

తాళికెరలో 'పొలం పిలుస్తోంది'

గుడిబండ: మండల పరిధిలోని తాళికెర, ఎస్ ఆర్ హట్టి గ్రామంలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ వీరనరేష్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం కంది, వేరుశనగ, రాగి పంట పొలాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు.

యూరియా వినియోగంపై అవగాహన

లేపాక్షి: మండలంలోని మానేపల్లి, లేపాక్షి–3 రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం రైతులకు యూరియాపై అవగాహన కల్పించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతు యూరియాను అవసరమైన మోతాదులోనే ఉపయోగించాలని, అధికంగా ఉపయోగిస్తే లాభాల కన్నా నష్టాలే ఎక్కువ అని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మానేపల్లిలో యూరియాను పంపిణి చేశారు.